ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 163 సోమవారం 16, ఫిబ్రవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# గులాబీ గుత్తాధిపత్యానికి... జాగృతి ముళ్లు



**ఓట్ల చీలికతో ముప్పు**
**బీఆర్ఎస్‌కు అతిపెద్ద ముప్పుగా కవిత**
**మున్సిపల్ ఎన్నికల్లో**
**సింహం గుర్తుతో గట్టి ప్రభావమే**
**పార్టీ పెడితే.. గెలుపు అంశం కాదు..**
**చీలికతోనే ప్రమాదం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

స్థానిక ఎన్నికల్లో ఒక్క ఓటు అయినా కీలకమే. ఎందుకంటే అదే గెలుపోటములను ప్రభావితం చేస్తోంది. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏడు మున్సిపల్ కార్పొరేషన్, ..మిగతా 2లో

# తండాలు, గూడేలకు మహార్దశ తెస్తాం

**రోడ్లు, పాఠశాలలు, పంచాయతీ భవనం, తాగునీరు, కరెంట్ ఇస్తాం**
**నల్లమల్లలో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్రం**
**గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మాణం**
**సంత్ శ్రీ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో ఉన్న అన్ని తండాలు, గూడాలకు మహార్దశ చేకూర్చుతామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వాటికి తప్పనిసరిగా బీటీ రోడ్డు ఉండేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. కనెక్టివిటీ కోసం బీటీ రోడ్డుతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలో పాఠశాల, పంచాయతీ భవనం ఉండాలని ..మిగతా 4లో

# హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం

**కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో వచ్చిన ఇబ్బందేమీలేదు**
**కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని చెప్పినా వినలేదు**
**సింగరేణి ప్రయోజనాల కోసమే సీపీఐతో జతకలుద్దామనుకున్నాం**
**కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్**
**34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం**
**కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు**
**బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారు**
**పోలీసులను, గుండాలను ఇంటికి పంపి బెదిరింపులకు గురి చేస్తున్నారు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



ఇప్పటికే పొత్తులో ఉన్న కాంగ్రెస్‌సీపీఐ మధ్య కొత్తగూడెం కార్పొరేషన్ లోనూ ఒప్పందం జరిగితే తమకు వచ్చిన ఇబ్బందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే తాము సీపీఐతో కలిసి పనిచేద్దామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని సీపీఐ నేతలతో చెప్పామన్నారు. అయినప్పటికీ సీపీఐ ఏ కారణం చేత పొత్తుకు ఒప్పుకుందో, వాళ్లకు ఏం ఒత్తిళ్లు ఉన్నాయో మాకు తెలియదని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాయని ఆరోపించిన కేటీఆర్... ..మిగతా 2లో



# ఏరియా 51లో ఏలియన్స్ లేరు

**అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా**
**ఇతర గ్రహాల్లో జీవం ఉండొచ్చని వ్యాఖ్యలు**
**పాడ్‌కాస్ట్‌లో సంచలన విషయాలు వెల్లడి**
**ఏరియా 51పై వెలుగులోకి ఆసక్తికర అంశాలు**
**రీపర్ డ్రోన్ల రాడార్ రికార్డులపై స్పందన**

**అమెరికా, (ప్రజాస్వరం):**

గ్రహాంతరవాసులు ఉన్నారా? ఉంటే ఎక్కడ? అనే ప్రశ్నలు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికాలోని 'ఏరియా 51' అనే ..మిగతా 3లో



# రేవంత్ ఒక్కడే మొనగాడా..?

**పదేండ్లు నేనే సీఎం అని చెప్పుకోవడం తప్పు**
**పార్టీ నేతలను, అధిష్టానాన్ని అవమానించాడు**
**ఆయన గట్టోడయితే మహబూబ్ నగర్ ఎంపీ సీటు ఎందుకు చేజారింది..?**
**సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

సీఎం రేవంత్ రెడ్డిపై అధికార పార్టీకి చెందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి విరుచుకుపడ్డారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సమయంలో తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రినని.. మరో పదేండ్లు నేనే సీఎం అని రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణకు ఆయన్ను ఎవరు రాజు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో ..మిగతా 4లో

# వాళ్లను పక్కనబెడితే సహించ

**పార్టీ కోసం పని చేసే వాళ్లను గుర్తించాల్సిందే**
**కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళతా**
**పార్టీ నిర్ణయాల్లో నా సూచనలు పరిగణలోకి తీసుకోవాలి**
**ఏఐసీసీ కార్యదర్శి సవాంత్ తో మాజీ మంత్రి జీవన్ రెడ్డి**
**జగిత్యాల ఎమ్మెల్యే, జీవన్ రెడ్డిల మధ్య సయోధ్య**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పార్టీ కోసం పని చేసే వాళ్లను పక్కనబెడితే కచ్చితంగా నిలదీస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్.. కాంగ్రెస్ లో చేరానని ఒకసారి, చేరలేదని మరోసారి దోబూచలాడుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గానికి బీ ఫామ్ లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం ..మిగతా 2లో

# కరీంనగర్ మేయర్ పదవి దక్కించుకుంటాం

**బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
**కచ్చితంగా రాజకీయ వ్యూహాలు అవలంబిస్తాం**
**మెజార్టీ లేకపోయినా బీజేపీ మేయర్ పీఠం ఎలా దక్కించుకుంటుంది?**
**ప్రశ్నించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



04

# ఆ ఒక్క పుర పీఠాన్నీ రేవంత్ లాక్కొంటున్నడు

**వడ్డేపల్లి మున్సిపాలిటీని హస్తగతం చేసుకునేలా సీఎం పావులు**
**64 సీట్లు వచ్చినా ఇంకా రేవంత్ కు అగడేందుకూ..?**
**ఈ వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది**
**సేవాలాల్, ఆదివాసీ, ఎరుకల తెగల పేరుతో కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలి**
**సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాశ్యంగా చేర్చాలి జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి తరపున తాము గెలుచుకున్న ఒక్క పుర పీఠాన్నీ సీఎం రేవంత్ రెడ్డి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. రాష్ట్రంలో 64 సీట్లు వచ్చిన ..మిగతా 4లో

# భారత్‌కు శివరాత్రి.. పాకిస్తాన్‌కు కాళరాత్రి..

**పాక్‌పై భారత్ విజయ దుందుభి**
**టీ20 వరల్డ్ కప్ లో పాకిస్తాన్‌ను చిత్తుగా ఓడించిన భారత్**
**పాకిస్తాన్‌ను బెంబేలెత్తించిన భారత బౌలర్లు**
**61 పరుగుల తేడాతో పాక్‌పై టీమిండియా ఘన విజయం.**




**కొలంబో, (ప్రజాస్వరం):**

టీ20 వరల్డ్ కప్‌లో దాయాది దేశాల మధ్య జరిగిన హైవోల్టేజ్ పోరులో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బౌలర్లు నిప్పులు ..మిగతా 2లో



# భారత్‌కు శివరాత్రి.. పాకిస్తాన్‌కు కాళరాత్రి..

**మొదటిపేజీ తరువాయి**

చెరిగే బంతులతో విరుచుకుపడటంతో పాకిస్తాన్ బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన పాక్‌ను భారత్ 61 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి, తన అజేయమైన రికార్డును కొనసాగించింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. అర్ష్‌దీప్ సింగ్ లేని లోటును భర్తీ చేస్తూ హార్దిక్ పాండ్యా, మొదటి ఓవర్‌లోనే సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను డకౌట్ చేసి వికెట్ మెయిడిన్‌తో శుభారంభం ఇచ్చాడు. ఆ తర్వాత జస్ప్రీత్ బుమ్రా తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. తన మొదటి ఓవర్‌లోనే ప్రమాదకరమైన సయీమ్ అయూబ్ (6), సల్మాన్ అఘా (4)లను అవుట్ చేసి పాక్ వెన్ను విరిచాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ పాక్‌ను కోలుకోనివ్వలేదు. ముఖ్యంగా పాక్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్‌ను అక్షర్ క్లీన్ బౌల్డ్ చేయడంతో భారత్ విజయం ఖాయమైంది. ఉస్మాన్ ఖాన్ (44) ఒక్కడే కాసేపు ప్రతిఘటించినా, అతడిని కూడా అక్షర్ స్టంప్ అవుట్ చేయడంతో పాక్ పతనం వేగవంతమైంది. చివరికి హార్దిక్ పాండ్యా తన అద్భుతమైన బౌలింగ్‌తో ఉస్మాన్ తారిఖ్‌ను బౌల్డ్ చేసి పాక్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. 17.6 ఓవర్లలో పాకిస్తాన్ కేవలం 114 పరుగులకే కుప్పకూలింది.

భారత బౌలర్లలో.. హార్దిక్ పాండ్యా, బుమ్రా కీలక వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి కూడా రెండు వికెట్లతో రాణించారు. వరుణ్ చక్రవర్తి ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీసి హ్యాట్రిక్ చేరువలోకి రావడం విశేషం. ఈ విజయంతో టీమిండియా తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. పాక్ బ్యాటర్ల తప్పుడు షాట్ సెలక్షన్‌ను భారత బౌలర్లు సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ఫీల్డింగ్‌లో కూడా రింకూ సింగ్, దూబె అద్భుతమైన క్యాచ్‌లు పట్టి బౌలర్లకు అండగా నిలిచారు. గతేడాది ఛాంపియన్లుగా ఉన్న భారత్, ఈ ఏటా అదే జోరును కొనసాగిస్తూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. దీనితో భారత్ T20 ప్రపంచ కప్‌లలో పాకిస్తాన్‌పై 81తో ఆధిక్యంలో ఉంది.

# వాళ్లను పక్కనబెడితే సహించ

**మొదటిపేజీ తరువాయి**

చేశారు. పార్టీ తనకు ఇచ్చిన 16 బీ ఫామ్‌లో తొమ్మిది చోట్ల గెలిచామన్న జీవన్ రెడ్డి... అదే సంజయ్ కుమార్ కు 34 బీ ఫామ్‌లు ఇస్తే 14 మాత్రమే గెలిచారని చెప్పారు. సంజయ్ పక్కన పెట్టిన 9 మంది ఇండిపెండెంట్లు కూడా గెలిచారని ఏఐసీసీ కార్యదర్శి సవాంత్ కు వివరణ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్సెస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వర్గాల మధ్య కుర్చీలాట కాంగ్రెస్ పార్టీకి తలనొప్పి వ్యవహారంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని అధిష్టానం మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఏఐసీసీ కార్యదర్శి సవాంత్‌కు అప్పగించింది. దీంతో సవాంత్, మంత్రి అడ్లూరితో జీవన్ రెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి పార్టీలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లారు. సంజయ్ కుమార్ పార్టీలో చేరిన తర్వాత.. తన వర్గీయులను పక్కనబెడుతూ తన వర్గానికి పెద్దపీట వేసుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సంజయ్ ను కట్టడి చేయాలని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సవాంత్ హామీ మేరకు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పిన జీవన్ రెడ్డి.. పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పార్టీ నిర్ణయాల్లో తన ఆలోచనలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. భేటీ అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని జీవన్ రెడ్డి చెప్పారన్నారు. పార్టీ నేతల్లో పొరపచ్చాలున్నప్పటికీ జగిత్యాలపై కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమన్నారు.






# హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం

**మొదటిపేజీ తరువాయి**

సింగరేణిని కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో కేటీఆర్ మాట్లాడారు. ఈ నెల 11న వెలువడ్డ మున్సిపల్ ఎన్నికల్లో హంగ్ వచ్చిన 38 పట్టణాల్లో కాంగ్రెస్ నేతలు అరాచకాలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఎత్తుకెళ్లి ప్రలోభాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులను, గుండాలను బీఆర్ఎస్ అభ్యర్థుల ఇళ్లకు పంపి బెదిరింపులకు గురిచేస్తున్నారని విరుచుకుపడ్డారు. అయినా ఎక్కడా బెదరకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ధైర్యంగా ఉన్నారని చెప్పారు. నేడు జరగనున్న ప్రమాణాస్వీకారంలో సమీకరణాలు మారుతున్నాయన్న ఆయన రాష్ట్రంలో మరిన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**కేసీఆర్.. గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేశారు**

సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని కేటీఆర్ తెలిపారు. లంబాడా తండాలను గ్రామ పంచాయితీలుగా చేసిన మాజీ సీఎం కేసీఆర్ గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేశారని వెల్లడించారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు 3,146 తండాలు, గూడేలను కొత్త గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ చొరవతో ఇప్పుడు 3146 మంది గిరిజన బిడ్డలు సర్పంచ్‌లు అయ్యారని తెలిపారు. గిరిజన తండాల్లో ఇంటింటికీ నీటి వసతి కల్పించామన్న కేటీఆర్.. నాలుగున్నర లక్షల ఎకరాలకు కేసీఆర్ ఒకే రోజు పోడు పట్టాలిచ్చారన్నారు. గిరిజన బిడ్డలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే అని కేటీఆర్ స్పష్టం చేశారు. గిరిజన బిడ్డల విద్య కోసం వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన వ్యాపారవేత్తలకు సీఎంఎస్‌టీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ తీసుకొచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్షలు ప్రభుత్వ సబ్సిడీ ఇచ్చామని అన్నారు. బంజారా బిడ్డలకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చామని అన్నారు. ప్రతి జిల్లాలో బంజారా భవన్‌కు స్థలం ఇచ్చామని, బంజారా భవన్‌లు కట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో బంజారాలకు మరింత అండగా నిలబడతామని హామీ ఇచ్చారు.



# గులాబీ గుత్తాధిపత్యానికి... జాగృతి ముల్లు



| పార్టీ | పొందిన ఓట్లు | ఓట్ల శాతం (%) | పోటీకి దిగిన అభ్యర్థులు |
|---|---|---|---|
| కాంగ్రెస్ | 15,04,669 | 39.80% | 2,936 |
| బీఆర్ఎస్ | 10,87,009 | 28.75% | 2,876 |
| బీజేపీ | 5,92,753 | 15.68% | 2,634 |
| స్వతంత్రులు | 3,14,096 | 8.31% | 2,787 |
| మజ్లిస్ | 1,24,236 | 3.29% | 283 |
| ఫార్వర్డ్ బ్లాక్ | 57,129 | 1.51% | 288 |
| సీపీఐ | 49,450 | 1.31% | 168 |
| సీపీఎం | 22,048 | 0.58% | 128 |
| జనసేన | 13,504 | 0.36% | 333 |
| బీఎస్పీ | 7,715 | 0.20% | 213 |
| టీఆర్‌ఏపీ | 3,379 | 0.09% | 91 |
| ఆప్ | 1,717 | 0.05% | 38 |
| ఇతరులు | 2,668 | 0.07% | 154 |

**మొదటిపేజీ తరువాయి**

116 మున్సిపాలిటీలలోని 2,981 వార్డులకు జరిగిన ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లు, 66 మున్సిపాలిటీ గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీ గెలిచి సత్తాచాటింది. కానీ పోల్ అయి, చెల్లుబాటైన ఓట్లలో కేవలం 39.8 శాతం ప్రజల ఓట్లు మాత్రమే దక్కించుకోగలిగింది. మొత్తం 2,936 మందిని పోటీకి దింపిన హస్తం పార్టీ 15,04,669 ఓట్లు దక్కించుకుంది. 2,876 మంది అభ్యర్థులు పోటీ చేసిన బీఆర్ఎస్ కు 28.75 శాతం ప్రజలు జైకొట్టారు. ఈ లెక్కన 10,87,009 మంది గులాబీ పార్టీ వైపు మొగ్గు చూపారు. ఈ రెండు పార్టీలు సాధించిన వార్డులు, మున్సిపాలిటీలలో భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ, ఓట్ల మధ్య తేడా కేవలం 4,17,660 మాత్రమే కావడం గమనార్హం. ఇక 2,634 మందిని బరిలోకి దింపిన కాషాయ దళం 15.68 శాతం ఓట్లను మాత్రమే సాధించగలిగింది. 5,92,753 మంది బీజేపీకి ఓటు వేశారు. చాలా మంది గెలుపోటములు ప్రభావితం చేసిన స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 2,787 మంది పోటీ చేయగా, 8.31 శాతంతో 3,14,096 ఓట్లు సాధించారు. కేవలం 283 వార్డుల్లోనే పోటీ చేసిన ఏఐఎంఐఎం (మజ్లిస్ పార్టీ) 3.29 శాతంతో 1,24,236 ఓట్లు పొందింది. ఇదంతా ఓకే.. కానీ, చాలా చోట్ల పదుల సంఖ్యలో గులాబీ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. ఓడిపోయిన వారందరికీ ఒకే కారణం చూపించలేకపోయినా.. అందులో కేసీఆర్ కూతురు, కేటీఆర్ సోదరి కవిత ప్రభావం మాత్రం ఎంతో కొంత కనిపిస్తోంది.

**గెలుపు కాదు.. విజయాలు తారుమారు**

ప్రధానంగా ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తుపై కవిత మద్దతుదారులు పోటీ చేశారు. ప్రస్తుత లెక్కల ప్రకారం ఫార్వర్డ్ బ్లాక్ కు వచ్చిన ఓట్లు 57 వేలు. ఇందులో మెజార్టీ కవితదే అన్నట్టు స్పష్టమవుతోంది. అంతేకాకుండా కొన్నిచోట్ల ఇండిపెండెంట్లకు కూడా కవిత మద్దతు ఇచ్చింది. అవి 1 శాతంగా కనిపిస్తున్నాయి. ఇలా దాదాపుగా లక్ష ఓట్లను ఎలాంటి గుర్తు.. సొంత పార్టీ లేకుండానే కవిత చీల్చి వేశారు. అంటే.. రాజకీయ రణరంగంలోకి దిగి.. పార్టీ గుర్తుపై పోటీకి సిద్ధమైతే.. ప్రధాన పార్టల గెలుపోటములను తారుమారు చేసే ఓట్లను కవిత చీల్చుతుందనడంలో సందేహం కనిపించడం లేదు.

**1537 వార్డుల్లో జయపతాకం ఎగురవేసిన హస్తం పార్టీ**

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల వారీగా తుది ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మొత్తం 2996 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా, ఒక స్థానంలో అభ్యర్థి మరణించడంతో ఎన్నిక వాయిదా పడింది. 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన వార్డులతో కలిపి మొత్తం 2995 వార్డుల ఫలితాలు వెల్లడైనట్లు ఎస్ఈసీ అధికారికంగా ప్రకటించింది. ఇందులో కాంగ్రెస్ కు 1537 వార్డులు, బీఆర్ఎస్ 781, బీజేపీ 336, ఎంఐఎం 70, సీపీఎం 13, బీఎస్పీ రెండు స్థానాలు దక్కాయి. టీడీపీ, వైసీపీ, ఆప్ లకు ఒక్క స్థానం కూడా దక్కలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన ఇతర పార్టీలు 73, స్వతంత్రులు 183 స్థానాల్లో గెలిచారు. పార్టీల వారీగా ఈ ఫలితాలను ఎస్ఈసీ వెబ్ సైట్ లో పొందుపర్చింది.

**కవిత రూపంలో గులాబీకి ముల్లు..?**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అనూహ్య మలుపులు తిరుగుతోంది. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని ఏలిన భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం పూర్వవైభవం పోరాడుతున్న తరుణంలో, ఆ పార్టీ ఇంటి పోరే పెద్ద శాపంగా మారేలా కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే దిశగా అడుగులు వేయడం గులాబీ బాటలో ముళ్ల కంచెగా మారుతోంది. పైకి బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో కవిత చీల్చే ప్రతి ఓటు పార్టీ పునాదులను కదిలిస్తుందని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

**సింహం గుర్తు ఎఫెక్ట్.. ఓట్ల చీలికతో ముప్పు**

మున్సిపల్ ఎన్నికల్లో కవిత ప్రత్యక్షంగా పార్టీ పెట్టకపోయినా, తన మద్దతుదారుల ద్వారా సింహం గుర్తుకు మద్దతు ఇచ్చి కొన్ని చోట్ల గట్టి ప్రభావమే చూపారు. ఈ పరిణామం బీఆర్ఎస్ పెద్దల కళ్లు బైర్లు కమ్మేలా చేసింది. కవిత పార్టీ పెట్టడం వల్ల ఆమె అధికారంలోకి వస్తారా లేదా అన్నది పక్కన పెడితే, ఆమె చీల్చే నాలుగు నుంచి ఐదు శాతం ఓట్లు బీఆర్ఎస్ గెలుపోటములను తలకిందులు చేయడం ఖాయం. ఉమ్మడి సిద్ధాంతాలు, ఒకే రకమైన ఓటు బ్యాంకు ఉండటంతో కవిత వైపు వెళ్లే ప్రతి ఓటు నేరుగా బీఆర్ఎస్ ఖాతా నుంచే మైనస్ అవుతుంది. ఇది త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల కొంప ముంచేలా ఉంది.

**పెరిగిన అంతరం**

కవిత తన రాజకీయ ప్రస్థానాన్ని కేవలం విమర్శలకే పరిమితం చేయకుండా, బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను గాలికి వదిలేశారంటూ ఆమె సంధిస్తున్న విమర్శలు పార్టీ కార్యకర్తల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ పట్ల గౌరవం చూపిస్తూనే, పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఆమె చేస్తున్న దాడి ద్వారా అసంతృప్త నేతలను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది రానున్న రోజుల్లో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణాన్ని దెబ్బతీసే ప్రమాదం కనిపిస్తోంది.

**బీసీ అస్త్రం.. రాజకీయ సామాజికం**

ప్రస్తుతం కవిత తన రాజకీయ ఎజెండాలో బీసీ సామాజిక వర్గాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె చేస్తున్న ఆరోపణలు పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుపై దెబ్బకొట్టేలా ఉన్నాయి. మరో మూడు నెలల్లో కొత్త పార్టీ పేరు , జెండాను ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేయడం, రాజకీయ వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నారనే వార్తలు బీఆర్ఎస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉద్యమ కాలం నుంచి తనతో నడిచిన తెలంగాణ జాగృతి కేడర్ ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా మారితే, అది బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది.

**గులాబీ కేడర్ కు అంతర్గత భయం**

ఏదైనా కవిత రూపంలో వచ్చే ప్రమాదం గులాబీ నేతలను అంతర్గతంగా భయపెడుతూనే ఉంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, కవిత వేస్తున్న అడుగులను గమనిస్తుంటే, రానున్న రోజుల్లో తెలంగాణలో చతుర్ముఖ పోరు తప్పదనిపిస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంటుంటే, మరోవైపు బీజేపీ తన ఉనికిని చాటుకుంటోంది. ఈ పరిస్థితుల్లో కవిత రూపంలో ఎదురవుతున్న ఈ సొంత ముప్పును బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆమె చేసే విమర్శలు ఆమెకు సానుభూతిని కూడగట్టడమే కాకుండా, తనకంటూ ఒక స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని సృష్టిస్తున్నాయి. ఈ రాజకీయ యుద్ధంలో కవిత గెలుస్తారో లేదో కానీ, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# తెలంగాణ యువతకు ఉద్యోగాలు రావడం ఇష్టం లేదా?



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేందుకు చేసిన కుటిల ప్రయత్నమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. నెగిటివ్ రాజకీయాల ద్వారా దేశ పురోగతిని వెనక్కి లాగేందుకు రాహుల్ కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. వాస్తవాలకు విరుద్ధంగా అన్నదాతలు, ఎగుమతిదారులను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అంగీకరించరన్నారు. ఇప్పటివరకు వరుసగా 100 ఎన్నికల్లో పరాజయాల తర్వాత రాహుల్ గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారని విమర్శించారు. అందుకే 11 ఏళ్లుగా దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. వీటిని కూడా ప్రజలు తిప్పికొడతారన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఇవాళ పోస్టు చేశారు.

**తెలంగాణ యువతకు ఉద్యోగాలు రావడం ఇష్టం లేదా?:**

ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తోందని 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTAs) ద్వారా రూ.45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్టైల్ పార్కులను అభివృద్ధి చేస్తోందని ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోందన్నారు. అమెరికా, ఇతర దేశాలతో కుదురుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగి, వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని దీని వల్ల తెలంగాణకు కూడా పెద్ద మొత్తంలో లబ్ధిచేకూరనుందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందడం, ఇక్కడి యువతకు ఉద్యోగాలు రావడం రాహుల్ గాంధీకి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు.

**పత్తి రైతులకు ఆందోళన అక్కర్లేదు:**

రాహుల్ గాంధీ ఒకవైపు వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, మరోవైపు పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు, వారిని ఆందోళనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. భారత వస్త్ర పరిశ్రమ రంగంలో విస్తారమైన వృద్ధి అవకాశాలు ఉన్నందున భారత పత్తికి డిమాండ్ నిరంతరం పెరుగుతుందని దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. అందువల్ల భారతీయ పత్తి రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక అంశాల్లో రాజీపడిన సంగతి మనందరికీ తెలుసని 2013లో బాలీలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) మంత్రివర్గ సమావేశంలో ధాన్యం, పత్తిపై కనీస మద్దతు ధర (MSP) వ్యవస్థను 2017 నాటికి రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు.


**అందుకు కాంగ్రెస్ సిగ్గుపడాలి:**

నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే 'ఆహార భద్రత'ను దృష్టిలో ఉంచుకుని.. అభివృద్ధి చెందుతున్న దేశాల పబ్లిక్ స్టాక్‌హోల్డింగ్ కార్యక్రమాలను WTO సవాలు చేయకూడదని ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. దేశ అన్నదాతల విషయంలో అన్యాయంగా వ్యవహరించినందుకు.. కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలన్నారు. డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జాతీయ రైతు సంఘం (NCF) సిఫారసులను అమలు చేసే ప్రసక్తే లేదని.. 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50% ఎక్కువగా MSP ఉండాలని స్వామినాథన్ కమిటీ సూచిస్తే దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించలేదని విమర్శించారు. అనంతరం, నరేంద్రమోడీ ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని MSP నిర్ణయించే విధానాన్ని అమలు చేసిందని రైతుకు అయ్యే ఉత్పత్తి వ్యయానికి రెట్టింపు ఆదాయం అందించే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందన్నారు..

## బంజారా ఆరాధ్య దైవమైన సేవాలాల్

**మాసాయిపేట ఫిబ్రవరి 15 ప్రజాస్వరం**

రామంతపూర్ తాండ గ్రామంలో బంజారా ఆరాధ్య దైవమైన సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని గ్రామ సర్పంచ్ చందర్ అన్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి ఘనంగా పూజలు హోమాలు నిర్వహించి అనంతరం బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందర్ ఉపసర్పంచ్ రాజు గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు





## ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు...

**మెదక్ ఫిబ్రవరి 15 (ప్రజా స్వరం)**

సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా మెదక్ మండలం సంగాయిగూడ గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి వేడుకలలో భాగంగా గ్రామం నుండి మెదక్ వెల్కం బోర్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డ్యాన్సులు, నృత్యాలతో యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం సర్పంచ్ శోక్లా నాయక్, యువత, నాయకులు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువకులు శ్రీకాంత్ నాయక్, చిన్న నాయక్ నరేష్ నాయక్, సుభాష్ నాయక్ మధు నాయక్, కుమార్ నాయక్ గ్రామ పెద్దలు, రవి నాయక్, సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వర్గల్ మండలంలో సంతు శ్రీ సేవాలాల్ జయంతి వేడుకలు

- **ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షుడు.**

**గజ్వేల్, వర్గల్ ఫిబ్రవరి 15 (ప్రజాస్వరం):**

బంజారాలలో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని బీజేపీ మండల అధ్యక్షులు బొలిపల్లి తిరుపతి రెడ్డి, సర్పంచ్ కుక్కల రామాంజనేయులు అన్నారు. ఆదివారం వర్గల్ మండలంలోని సీతారాంపల్లి లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ కి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారన్నారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేసారాన్నారు. సీతారాంపల్లి నుండి గౌరారం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యూత్ తదితరులు పాల్గొన్నారు



# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని ఏడుపాయల అభివృద్ధి...

- **భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి....**
- **అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి....**
- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్.....**
- **అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాణి దంపతులు...**

**మెదక్ ఫిబ్రవరి 15 (ప్రజా స్వరం)**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయల అభివృద్ధి కోట్లది రూపాయలు మంజూరు చేయించి జాతరకు వచ్చే భక్తులకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలకు చేరుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాణి దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రోహిత్ శివాణి దంపతులు వన దుర్గామాతకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యే రోహిత్ రావ్ శివాణి దంపతులకు శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయలను అభివృద్ధి చేసేందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరుగుతున్న జాతరకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున భక్తులకు అవసరమైన వసతులు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సేవలు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, ఆలయ ఈఓ వీరేశం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి పల్లి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంతప్ప మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయాక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్ ఆలయ సిబ్బంది, ఆలయ పూజారులు, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.





## కోరిన కోర్కెలు తీర్చే భోళా శంకరుడు..!

- **శివ దర్శనానికి బారులుతీరిన భక్తులు**
- **తూర్పు ముఖమున గోదావరినది ప్రవహించడం విశేషం**
- **భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**

**పినపాక ఫిబ్రవరి 15 (ప్రజాస్వరం):**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పినపాక మండల వ్యాప్తంగా చింతల బయ్యారం, సీతంపేట, జానంపేట,దుగినేపల్లి,గొట్టెల్ల శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. హర హర మహాదేవ..శంభోశంకర..ఓం నమ:శివాయ అంటూ శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. శివపార్వతులను పట్టు వస్త్రాలతో అలంకరించారు.ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళు వేశారు. కళ్యాణ మండపాన్ని పచ్చి పూలతో అలంకరించారు. భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు తరలివచ్చి శివపార్వతులను దర్శించుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు నిష్టగా ఉపవాస దీక్షలు చేపట్టారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు శివపార్వతులను స్మరిస్తూ ఉపవాసం చేస్తారు. గోదావరి తీరాన స్నానమాచరించే భక్తుల కోసం మహిళలకు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శివార్చన జరిగింది. సాయంత్రం పలు రకాల పండ్లు సేవించి ఉపవాసాన్ని విడవనున్నారు. రాత్రంతా జాగారం చేస్తూ పరమశివున్ని స్మరించుకున్నారు.పవిత్ర గౌతమి గోదావరి తీరాన తూర్పు ముఖమున గోదావరి నది ప్రవహించడం విశేషం. ఉదయించే సూర్య కిరణాలు వెండి నాగుపడగల శివలింగాన్ని తాకుతూ ప్రసరిస్తాయి. ముఖ్యంగా చింతల బయ్యారం గ్రామంలో గోదావరి నది తీరాన పురాతన కాలంనాటి చారిత్రకమైన స్వయంభుగా వెలసిన శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు వేల సంఖ్యలో తిలకించారు. తెల్లవారి జామున 4 గంటల నుంచి ఆ పరమశివుని దర్శించుకునేందుకు శివాలయంలో భక్తులు క్యూ లైన్లుకట్టారు. శంభో శంకర అంటూ మహా శివుడిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాటు చేశారు.ముఖ్యంగా చింతల బయ్యారం శివపార్వతుల సన్నిధిలో భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది.



## రామంతపూర్ తండాలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

**మాసాయిపేట ఫిబ్రవరి 16 ప్రజాస్వరం**

సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామంతపూర్ తండాలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ కేతావత్ చందర్ నాయక్ ఈ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తండాలోని యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాల సాధనతో పాటు, యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రాజునాయక్ వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు




## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఐదుగురు స్వతంత్ర కార్పొరేటర్లు



**భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి 15(ప్రజాస్వరం):**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన ఐదుగురు కార్పొరేటర్లు ఆదివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. మంత్రి పొంగులేటి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో 1వ డివిజన్ కార్పొరేటర్ సీరపు సుగుణ, 13వ డివిజన్ కార్పొరేటర్ తలుగు శాంతా, 34వ డివిజన్ కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి, 42వ డివిజన్ కార్పొరేటర్ దున్నపోతుల మణి, 48వ డివిజన్ కార్పొరేటర్ ధర్మసోత్ నరేష్ ఉన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి వేళ మోతేగడ్డలో భక్తుల అవస్థలు

- **గోదావరి దాటలేక గంటల తరబడి వేచి చూస్తున్న వైనం**
- **అరకొరగా ఏర్పాట్లు.. ప్రభుత్వ తీరుపై భక్తుల ఆగ్రహం**

**బూర్గంపాడు ఫిబ్రవరి 15(ప్రజాస్వరం):**

బూర్గంపాడు మండలంలోని ప్రసిద్ధిగాంచిన మోతేగడ్డ శ్రీ వీరభద్ర స్వామి క్షేత్రం మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులతో పోటెత్తింది. అయితే, భక్తుల రద్దీని అంచనా వేయడంలో అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి నది మధ్యలో వెలసిన స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు నది దాటాల్సి ఉండగా, తగినన్ని పడవలు లేకపోవడంతో వేలాది మంది భక్తులు గంటల తరబడి తీరం వద్దే పడిగాపులు కాస్తున్నారు.

**అంచనా తప్పిన యంత్రాంగం:**

ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా భక్తులు భారీగా వస్తారని తెలిసినప్పటికీ, ఈ ఏడాది ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని భక్తులు ఆరోపిస్తున్నారు. పరిమిత సంఖ్యలో ఉన్న పడవల వల్ల ఒక్కో భక్తుడు తన వంతు కోసం 3 నుంచి 4 గంటల పాటు ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**బోట్లు కరువు.. పెరిగిన నిరీక్షణ:**

స్వామివారి దర్శనం కోసం ఉదయాన్నే వచ్చాం. కానీ నది దాటడానికి పడవలు లేక ఇక్కడే ఉండిపోయాం. భక్తుల రద్దీకి తగ్గట్లుగా అదనపు బోట్లను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది.

**రక్షణ చర్యలు నామమాత్రమే:**

భారీగా జనం తరలివచ్చినప్పటికీ, ఘాట్ల వద్ద భద్రతా ఏర్పాట్లు గానీ, కనీస సౌకర్యాలు గానీ ఆశించిన స్థాయిలో లేవు. పడవల్లో సామర్థ్యానికి మించి భక్తులను ఎక్కించుకుంటున్నారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి, తక్షణమే అదనపు బోట్లను ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



# పట్టణ సభ పట్టణ ప్రగతికి మార్గం

- **ప్రజల ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి పట్టణ సభలే సరైన వేదిక అరిస్టాటిల్**
- **పట్టణ సభలు ప్రజల్లో సామాజిక బాధ్యతను పౌర ధర్మాన్ని పెంచుతాయి -జెఎస్ మిల్**

**కరీంనగర్/ హైదరాబాద్ (ప్రజాస్వరం)**

నగరీకరణ / పట్టణీకరణలో మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్స్ కీలక పాత్ర పోషిస్థాయి. తెలంగాణ రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలకు 7 మున్సిపల్ కార్పొరేషన్ కు ఫిబ్రవరి 11 ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటర్లు వార్డు/ డివిజన్/ కౌన్సిలర్ కార్పొరేటర్ లనుఎన్నుకున్నారు. పట్టణాలలో పుర పాలక సంస్థల పాలక వర్గాలు ఫిబ్రవరి 16 న ప్రమాణ స్వీకారంచేస్థాయి.స్థానిక స్వపరిపాలన ప్రారంభ మౌతుంది. వార్డు /డివిజన్ /పట్టణంలో ప్రజాస్వామ్య పాలనకు పారదర్శని కత జవాబుదారీ తనానికి వార్డు/ డివిజన్/ పట్టణ సభలు ఆయువుపట్టు. . రాజనీతి శాస్త్రవేత్తలు పట్టణ సభలను "పాల్గొనే పట్టణ పాలనగా "అభివర్ణించారు.

ప్రజలు తమ నగరాన్ని నిర్మించు కునే హక్కు ఉంటుంది అది కేవలం పట్టణ సభల ద్వారానే సాధ్యమవుతుందని అరిస్టాటిల్ పేర్కొన్నారు. సమగ్ర నగర /పట్టణాభివృద్ధిలో పట్టణ సభలే కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ వార్డు /డివిజన్ పట్టణ సభలు చాలా చోట్ల నామమాత్రమైనాయి. పట్టణసభ నిర్వహణలో అనేకసమస్యలు సవాళ్లు ఎదురౌతున్నాయి.

**ప్రజల్లో అవగాహన లోపం**

**ప్రజల భాగస్వామ్యం లోపించడం.**

ప్రజలకు /ఓటర్లకు వార్డు /డివిజన్ పట్టణసభ పైఅవగాహనలేదు.చాలా నగరాల్లో / పట్టణాల్లో ఉన్న ఓటర్లలో/ ప్రజల్లో ఉదాసీనత నిర్లక్ష్యం నిర్లిప్తత నెలకొని ఉంది. పట్టణ సభల పట్ల ఆసక్తితగ్గడం. ఆశించిన స్థాయిలో జనం హాజరు కాకపోవడం ఒక సవాలుగా పరిణమించింది. ఓటర్లలో/ ప్రజల్లో
ప్రశ్నించే తత్వంలేదు .పుర పాలక అధికారాలు వారు నిర్వహించే విధులు బాధ్యతలు పనిచేసే విధానం ప్రాముఖ్యత గురించి తెలియదు .పట్టణభ అంటే ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమం ఒకతంతు అని తెలుసు.వార్డు/ డివిజన్ సభ అంటే ప్రభుత్వ కార్య క్రమంఅనేఅభిప్రాయం ప్రజల్లోనాటుకొనిఉంది. తమ తల రాతలు మార్చుకోవడానికి తమ బతుకుల్లో వెలుగులు తేవడానికి తమ ప్రణాళికలు తామే రూపొందించుకునే వేదిక అనే విషయం చాలా మంది పుర వాసులకు తెలియక పోవడం విచారకరం. పట్టణసభ సమావేశాలు ప్రభుత్వ సమావేశా లుగా భావిస్తున్నారే తప్ప నగర/ పట్టణ అభివృద్ధి కొరకు జరిగే సమావేశాలుగా భావించడంలేదు. అందువల్ల చాలామంది నగరవా సులు ప్రజలు/ ఓటర్లుపట్టణసభలో పాల్గొనడానికి ఆసక్తిచూపడంలేదు.

**రాజకీయ జోక్యం_ ఆధిపత్యం**

**పట్టణ సభ**

పట్టణ సభలు కొన్నిసార్లు రాజకీయ నాయకుల ప్రమేయం వల్ల అసలైన ప్రజా సమస్యలు పక్కకు వెళ్లి పార్టీల మధ్య వాదోపవాదాలకు వేదికగా మారుతున్నాయి. రాజకీయ పార్టీలు వర్గాధిపత్యానికి పట్టణ సభలను వాడుకుంటున్నాయి. పట్టణ సభలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. అధికారంలో ఉన్న వర్గం యొక్క ఆధిపత్యం పట్టణసభలో రాజ్యమేలటం గమనార్హం. వార్డు /డివిజన్ సమస్యలు చర్చకు రావడం లేదు.ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపికలో అధికార వర్గానికి పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.వార్డు/ డివిజన్/ పట్టణ వర్గాల ఆధిపత్య పోరుకు పట్టణ సభను వేదికగా ఎంచుకుంటు న్నారని అనేకపరిశో ధనలుతెలుపుతున్నాయి.అధికారపక్షం తమ కార్యకర్తలకు తమ కులం వారికి ప్రాధాన్యత ఇచ్చే సభగా పట్టణసభ మారిపోయింది. పట్టణసభ పై బలమైన సామాజిక వర్గం అధికారం చెల్లించడం తమ నియంత్రణలోఉంచుకోవడంసామాన్యులు పట్టణ పేదలు స్లమ్ ఏరియాల్లో నివసించే ప్రజలు తమ సమస్యలను వినిపించే స్థితిలోలేరు.ఒకవేళ హాజరై సమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చినప్పటికీ పుర పాలక (మున్సిపల్) అధికారులు ఆసమస్యలపై చర్చించడం లేదు . సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించిన దాఖలాలులేవు.సామాన్యుల యొక్కసూచనలు విజ్ఞప్తులు బుట్ట దాకలౌతున్నాయి. అందువల్ల పట్టణాల్లో నివసించే పేదలు సామాన్యులు పట్టణసభ అంటే నగరంలో పట్టణంలో ఉన్న ఆధిపత్య కులాలు అధికార వర్గం యొక్క పోరాట వేదికగా భావిస్తున్నారు. ప్రజావాణిని వినిపించే ప్రజాసంక్షేమం గురించి చర్చించే సభగా పరిగణించడం లేదు.

**కోరం _కనీస సంఖ్య లేకపోవడం.**

పట్టణసభ నిర్వహించడానికి కావలసిన కోరం కనీస సంఖ్యలో (ఓటర్లు) ప్రజలు హాజరు కావడం లేదని వాయిదా వేయడం జరుగుతుంది. పట్టణ సభను నామమాత్రంగా నిర్వహించి సంతకాలుతీసుకొని ముగిస్తున్నారు.పట్టణసభకు హాజరుగాని వివిధ వార్డు కమిటీల సభ్యుల ఇంటికి వెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు.ఈవిధానం మారాలి.

**ప్రజా భాగస్వామ్యం _ పట్టణ సభ.**

పట్టణ సభ ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తుంది .నగరాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలోఅధికారులు మాత్రమే కాకుండా స్థానిక ప్రజలు స్థానిక అవసరాలు సమస్యలను వాటి పరిష్కారం కోసం ప్రాధాన్య
క్రమాన్ని నిర్ణయించడం.
ప్రజల కోసం ప్రజల చేత పరిపాలనకు ఇది మొదటి మెట్టు. ప్రాథమిక సమస్యలు గుర్తింపు నగరంలోని ప్రతివార్డు /డివిజన్ లో ఉండే సమస్య గుర్తించడం
డ్రైనేజీ వీధి దీపాలు పార్కుల నిర్వహణ నిధుల సక్రమ వినియోగం పట్ల చర్చిస్తారు.

**వికేంద్రీకృత ప్రణాళిక _పట్టణ సభ.**

నగర మొత్తానికి ఒకే ప్రణాళిక కాకుండా సూక్ష్మ స్థాయి ప్రణాళికల రూపకల్పన వార్డుడెవలప్మెంట్ ప్లాను రూపొందించడంలో వనరుల వినియోగం పంపిణీలో అసమాన తలు తగ్గించడంలొ పట్టణ సభ కీలక పాత్ర పోషిస్తుంది.

**పర్యావరణం మరియు స్వచ్ఛత.**

వార్డు/ డివిజన్ పరిధిలో స్వచ్ఛ బారత్ కార్యక్రమాలను నిర్వహించడం పచ్చదనం పరిశుభ్రత పాటించడం చెత్తను వేరుచేయడం స్థానిక చెరువుల పరిరక్షణ చెట్లు నాటడం హరితహారం మున్నగు పర్యావరణ హిత పట్టణాభివృది ప్రణాళికల రూపకల్పన పథకాల అమలు పట్టణసభలు చేపడతాయి.

**పట్టణ సభ _పుర పాలన**

**ప్రజాస్వామ్యానికి వేదిక.**

సమిష్టి నిర్ణయాలకు పట్టణసభ వేదికగా మారాలి .నగరాల్లో పట్టణాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి. మహిళలకు బలహీన వర్గాలకు భాగస్వామ్యం లేక పోవ డం.పట్టణ సభలకు నగరం/ పట్టణంలోని మహిళలు ఎస్సీలు ఎస్టీలు హాజరు కావడం లేదు.

ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగావివరించ లేకపోతున్నారు. వారి అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యతఇవ్వడంలేదు.కాబట్టి
మహిళాభ్యుదయం ఎస్సీ ఎస్టీ సంక్షేమం అభివృధి సంక్షేమ పథకాలు అమలు అటుకెక్కడం వల్ల. మహిళా సాధికారిత యువజన సాధికారిత ఉపాధి హామీ పథకాలు వికలాంగుల సంక్షేమం ఎస్సీ ఎస్టీ సంక్షేమం సంక్షోభంలో పడింది.

**సామాజిక న్యాయం_ పట్టణ సభ.**

వార్డు/ డివిజన్ పరిధిలోని ఎస్సీ ఎస్టీ బీసీ ల మహిళా సంక్షేమ పథకాల అమలు లబ్ధిదారుల ఎంపిక మురికి వాడల్లో నివసించే వారి సమస్యలను చర్చించి ప్రభుత్వ పథకాలు పేదల ముంగిట్లో చేర్చి సామాజిక ఆర్థిక న్యాయం చేకూర్చడానికి పట్టణ సభ చొరవ తీసుకుంటుంది.

**అధికారుల సమన్వయ లోపం.**

ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు పట్టణ సభకు హాజరుకావడం లేదు ఆఫీస్ గుమస్తాలను తమ ప్రతినిధులుగా పంపి పట్టణసభలోవచ్చినదరఖాస్తులనుస్వీకరిస్తున్నారు.అధికారుల్లో సమన్వయం లేదు. పట్టణ సభ జరుగు నప్పుడు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి.ఉద్యానవన శాఖ విద్యుత్తువిద్య మరియు నీటి సరఫరా పారిశుధ్యం ఆరోగ్యం ప్రజా రవాణా కుసంబంధించిన అధికారులు హాజరుకావడం లేదు.ప్రజలు/ ఓటర్లు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవారు పట్టణసభలో లేకపోవడం వల్ల చాలామంది ఓటర్లు /ప్రజలు పట్టణసభకు హాజరు కావడంపై ఆసక్తి చూపడం లేదు.

**సమయ నిర్వహణ _పట్టణ సభ.**

**వార్డు/ డివిజన్/ పట్టణ సభ**

సమయ నిర్వహణ మీద స్పష్టత లేకపోవడం .పట్టణంలో చర్చించాల్సిన అంశాలు ఎక్కువగా ఉండడం. ప్రజలపిర్యాధులు పెరగడం వల్ల సభలో నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు పట్టణ సభ సమావేశాలు జరుగుతున్నాయి. ఓపికగా ఉండే పరిస్థితులు పట్టణ వాసుల్లో కొరవడ్డది.

**నిధుల కొరత _నిర్ణయాల అమలులో జాప్యం.**

వార్డు/ డివిజన్/ పట్టణ సభలో తీసుకున్ననిర్ణయాలను అమలు చేయడానికి మున్సిపాలిటీల దగ్గర తగిన నిధులులేవు. నిధుల కొరత రాజ్యమేలుతుంది. ఫైనాన్స్ కమిషన్ (ఆర్థిక సంఘం) ద్వారా సకాలంలో నిధులు మంజూరు కాకపోవడం.చాలా నగరాలు/పట్టణాలు ఆర్థిక వనరులు కొరతను ఎదుర్కొంటున్నాయి.

**స్థానిక సంస్థల అధికారాలు బదిలీ కాలేదు.**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (బి) 74వరాజ్యాంగ సవరణ చట్టం 1992 ప్రకారం మున్సిపాలిటీ చట్టానికి నిర్దిష్ట నిబంధనలు ఆయా రాష్ట్రప్రభుత్వాలురూపొందించకునే అధికారం ఇచ్చింది .పట్టణ సభకు?రాజ్యాంగహోదా ఇవ్వడం జరిగింది.
74 వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల సాధికారిత కొరకు రూపొందించిన అంశాలు నేటికి స్థానిక సంస్థలకు పూర్తిగాబదిలీ కాలేదు. స్థానిక సంస్థల చట్టంలో పేర్కొన్న అంశాలు నేటికీ కాగితాలికే పరిమితమైనాయి. మున్సిపాలిటీలకు ఏఅంశాలపై నిర్ణయం తీసుకోవాలనే విషయంలో మున్సిపల్ అధికారులకు సిబ్బందికి స్పష్టత లేకపోవడం గొప్ప లోపం. సభలో చేసిన తీర్మానాలు కాగితాలకే పరిమితమోతున్నాయి.ప్రజలకు
పట్టణ సభలపై నమ్మకం సడలి పోతుంది .ప్రచారం లేకపోవడం పట్టణసభఎప్పుడునిర్వహిస్తారు ?ఎక్కడ నిర్వహిస్తారు?ఏ సమయంలో నిర్వహిస్తారు? అనేటువంటి విషయంలో స్పష్టతలేదు.ప్రచారం సమాచారం ప్రజలకు ముందే చేరకపోవడం వల్ల చాలామంది ఓటర్లు /ప్రజలు పట్టణ సభలకు హాజరు కావడం లేదని పరిశోధనలో తేలింది. పట్టన సభ ఉందని నోటీస్ బోర్డు వరకే పరిమితం కావడం వల్ల అందరికి సమాచారం అందడం లేదు.

**పట్టణ సభ నిర్వహణలో**

**ఎదురవుతున్న సవాళ్లు పరిష్కారాలు.**

పట్టణ సభ సమర్థవంతంగా నిర్వహించ డంలో ఎదురౌతున్న సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం తగు సంస్కరణలు ప్రవేశపెట్టి అమలు చేయాలి.

**డిజిటల్ సాధనాల**

**వినియోగం__విస్తృత ప్రచారం.**

స్వచ్ఛంద సంస్థలు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.వార్డు/ డివిజన్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో కుల సంఘాలకు స్వశక్తి మహిళా సంఘాలకు యువజన సంఘాలకు రెసిడెన్షియల్ అసోసియేషన్స్ కు పట్టణ సభ నిర్వహణ తేదీ సమాచారాన్ని నోటీస్ ద్వారా తెలుపాలి.

**డిజిటల్ సాధనాల వినియోగం పెరగాలి.**

క్షేత్రస్థాయిలోప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి పట్టణ సభల నిర్వహణలో డిజిటల్ సాధనాలవినియోగాన్నిపెంచాలి .
ఎ, ఐ ఆధారిత సాధనాలు మున్సిపాలిటీల ఆప్ ను ప్రవేశపెట్టాలి. వీటి ద్వారా పట్టణ సభ చర్చలు రికార్డు చేయడం సులభం. మహిళ యువజన భాగస్వామ్యాన్ని పెంచడానికి యువతను పుర పాలనలో భాగస్వాములు చేయడానికి మోడల్ యూత్ పట్టణ సభలను ప్రోత్సహించాలి.

**మునిసిపల్ పాలన చట్టాలపై శిక్షణ.**

స్థానిక సంస్థల్లో మున్సిపాలిటీ మున్సిపల్ కార్పొరేషన్లోఎన్నికైన కౌన్సిలర్స్ కార్పొరేటర్స్ (ప్రజా ప్రతినిధులకు) బడ్జెట్ పద్దులు రెవెన్యూ మార్గాలు ప్రజాసేవ మున్సిపల్ చట్టం లోని అంశాల మీద అవగాహన కల్పించేందుకు డాక్టర్ ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఇనిస్టిట్ ( MCRHRDI) తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధి శాఖలు శిక్షణను అందిస్తాయి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ మున్సిపాలిటీల మున్సిపల్ కార్పొరేషన్ల పనితీరు అధికారాలు విధుల మీద ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తారు.
రీజినల్ సెంటర్ అర్బన్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ఉస్మానియా యూనివర్సిటీ లోదక్షిణ భారత దేశంలో ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్స్ /కార్పొరేటర్స్ కు పట్టణ పరిపాల అంశాల మీద శిక్షణ ఇస్తారు.

**పట్టణసభ _తీర్మానాలు సమీక్ష.**

పట్టణ సభలో తీసుకున్న తీర్మానాలపై ఎప్పటికప్పుడే సమీక్ష నిర్వహించాలి. ఆమోదించిన జమ ఖర్చుల పద్దులు ఆడిట్ నివేదికలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లు ఎంపిక వివరాలు నివేదిక రూపంలో పట్టణ సభకు అందు బాటులో ఉంచాలి .ప్రస్తుతం చేపట్టే ప్రాజెక్టులు భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి సమగ్రమైన రిపోర్టు లేదా నివేదికలను వార్డు /డివిజన్ కార్యాలయాల్లోఅందుబాటులో ఉంచాలి.

**పట్టణసభ ఎజెండా నివేదిక**

**కాపీలు సర్క్యులేట్ చేయాలి.**

ప్రతి వార్డ్ డివిజన్ లోని వివిధ కమిటీ మెంబర్లుకు ఒక కాపీని సర్క్యులేట్ చేయాలి. పట్టణసభకు హాజరైనటువంటి ఓటర్లకు గత పట్టణసభలోతీసుకున్ననిర్ణయాలుఅమలుమీదసమగ్రసమీక్షనిర్వహించాలి.కార్యక్రమాలనిర్వహణలో
ఎదురవుతున్నసమస్యలపై సమగ్రంగా చర్చించాలి. వార్డు/ డివిజన్లో ఉన్న ప్రతి ఓటరు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసేటప్పుడు చూయించిన ఉత్సాహంకంటే రెట్టింపైన ఉత్సాహంతో పట్టణ సభ సమావేశాల్లో పాల్గొనాలి.తన గొంతును గట్టిగా వినిపించాలి. పట్టణ సభలో సామాన్యుల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి.

**ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేయాలి.**

ఓటర్లుపట్టణ సభ జరగని సమయంలో తమ సమస్యలను తెలుపడానికి నిర్మాణాత్మక సలహాలు ఇవ్వడానికి వార్డు/ డివిజన్ /ఆఫీసులో కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేయాలి. ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయాలి. ప్రతివార్డు/ డివిజన్ కార్యాల యంలో మెరుగైన పురపాలనకు అవసరమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మెరుగైన పాలనలో పట్టణ పౌరుల భాగస్వామ్యాన్ని పెంచాలి. రోజు వారీగా బాక్సులను తెరిచి వచ్చిన సూచనలను రికార్డు చేసి పట్టణ సభలో వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి.

**పట్టణ సభ తీర్మానాలు శాసనం లాంటివి.**

పట్టణ సభఅంటే ఓటర్లసభ పట్టణ సభతీర్మానాలు శాసనంలాంటివి . పట్టణ సభప్రజాస్వామ్య వేదిక కౌన్సిలర్/ కార్పొరేటర్ నుండి సామాన్యునివరకు అందరూ కలిసి సమష్టినిర్ణయాలు తీసుకుంటారు.

**నిధులు వినియోగం**

**నియంత్రణ _పట్టణ సభ.**

నిధుల వినియోగం నియంత్రణ నివారణలో పట్టణ సభ కీలక పాత్ర పోషిస్తుంది.ప్రజాపనుల్లో కాంట్రాక్టర్లు చేసే పని మున్సిపల్ సిబ్బందిని పట్టణ సభ ప్రశ్నిస్తోంది. అవినీతి అంతం చేయడానికి అభివృధి పథకాల్లో జరుగుతున్న అవకతవకలు అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

**పట్టణ సభ ప్రజల వద్దకు పాలన.**

ప్రజల వద్దకు పాలన అందించ డంలోపట్టణసభవారధి.పట్టణీకరణలో ప్రభుత్వ యంత్రాంగం క్రియాశీలక పాత్ర పోషిస్తుంది. జిల్లాకలెక్టర్ జాయింట్ కలెక్టర్ వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పట్టణసభల సమావేశాలకు హాజరుకావాలి. ప్రజలు ఎదుర్కునే సమస్యల పరిష్కారానికి కృషిచెయ్యాలి. విద్య పారిశుద్ధ్యం తాగునీటి సరఫరా మురికి కాలువల నిర్వహణ డ్రైనేజీనిర్వహణ నర్సరీ పెంపకం వారాంతపు సంత (మార్కెట్) చెట్ల పెంపకం కోతుల బెడద పందుల బెడద వీధికుక్కల బెడద మొదలగు ఇబ్బందులను చర్చించి పరిష్కరించాలి.

**పట్టణ సభ _ప్రజా ప్రతినిధులు.**

పట్టణసభసమావేశాలకుఆయా వార్డు డివిజన్ పరిధిలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎం'పీలు ఎమ్మెల్యేలుహాజరుకావాలి .ఓటర్లు /ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉంటుంది. తమ సమస్యలను చెప్పుకోవడానికి పార్లమెంటుకు అసెంబ్లీకి ప్రజలు వెళ్లలేరు. ప్రజలందరూ పాల్గొనే పట్టణ సభలకు ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.ఎంపీ ఎమ్మెల్యే కు
తమ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాతినిధ్యం జరపడానికి పట్టణ సభలు తోడ్పడతాయి.ఎంపీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధి కారులు పట్టణ సభలకు హాజరైతే తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే విశ్వాసం ప్రజలకు/ ఓటర్లకు కలుగుతుంది. పట్టణ సభలు విజయవంతం అవుతాయి. పట్టణీకరణ సాకారం అవుతుంది.

**పట్టణసభ_ బడ్జెట్ ఆడిట్ నివేదిక.**

పట్టణ సభ బడ్జెట్ ఆడిట్ నివేదికను ఆమోదించాలి.పట్టణ సభ తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2018 ప్రకారం సంవత్సరానికి నాలుగు సార్లు (4) వార్డు/ డివిజన్/ పట్టణ సభలు జరగాలి.

**సుస్థిర నగర/ పట్టాభివృద్ధి _సాధన పట్టణ సభ**

సుస్థిర పట్టణాభివృద్ధి సాకారం కావాలంటె పట్టణ సభలో ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని సమన్వయంతో వార్డు/ డివిజన్/ పట్టణ సమగ్ర అభివృద్ధి కొరకు ప్రణాళికల రూపకల్పన చేయాలి. పట్టణ అభివృద్ధికి మెరుగైన కార్యాచరణ చేపడితే పట్టణ సమస్యల పరిష్కారమై పట్టణీకరణ లక్ష్యం నెరవేరుతుంది.

**పట్టణ సభ_ స్థానిక**

**స్వపరిపాలన (సంస్థల) సాధికారిత.**

పట్టణ సభలు కేవలం వినతులు ఇచ్చే వేదికలు కాకుండ వార్డు/ డివిజన్ అభివృద్ధి ప్రణాళికలను ఆమోదించే స్థాయికి ఎదగాలి.
పట్టణ సభ సమావేశాలకు నిర్దిష్ట కాల పరిమితిని కఠినతరం చేయాలి. ప్రభుత్వం సంస్కరణల ద్వారా పట్టణ సభలను క్షేత్ర స్థాయిలో నిజమైన ప్రజాస్వామ్య వేదికలుగా మార్చాలి.
ప్రభుత్వం పురపాలన సాధికారిత కు ఆర్థిక పరిపుష్టికిచట్టబద్ధమైన సంస్కరణలు తీసుకొని మెరుగైన పురపాలనకు తగు కార్యాచరణతో ముందుకు వచ్చి పట్టణాభివృద్ధే దేశాభివృద్ధి దిశగా సమగ్రమైన చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.

**నేదునూరి కనకయ్య**
**అద్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**కరీంనగర్9440245771**





# యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..

- **వాలీబాల్ కిట్టును అందజేస్తున్న సర్పంచ్ గణేష్...**

**గజ్వేల్, వర్గల్ ఫిబ్రవరి 15 (ప్రజాస్వరం):**

మండలంలోని తుంకి కల్ల గ్రామంలో అంబేద్కర్ యూత్ యువకులకు ఆదివారం వాలీబాల్ కిట్ను గ్రామ సర్పంచ్ కొండగల్ల గణేష్ అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు కుక్కల శ్రీనివాస్, జొన్నాడ రాజు, మైలారం సహదేవ్, వంక కుమార్, నరసింహులు , కొండగల రమేష్ తదితరులు పాల్గొన్నారు

# దేవులపల్లి రమేశ్ కు రవీంద్ర భారతిలో సన్మానం

**సిద్దిపేట,ఫిబ్రవరి15, ప్రజాస్వరం**

హైదరాబాద్ రవీంద్రభారతిలో విమల సాహితీ సమితి, తెలంగాణ సాంస్కృతిక శాఖ, సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా.జెల్ది విద్యాధర్ & సిరికొండ నరసింహారావు, రచించిన "యుద్ధం శాంతి "పుస్తక ఆవిష్కరణలో నంగునూర్ మండలనికి చెందిన రచయిత, కవి దేవులపల్లి రమేశ్,దేశామా నీకు ఇదేవందనం అనే కవిత గానం చేసినందుకు గాను సాహిత్య సేవలు అందించినందుకు ముఖ్యఅతిధి పద్మ శ్రీ కులకలూరి ఇనాక్, డాక్టర్ గోరేటి వెంకన్న, డా. బిక్కికృష్ణ,డా. రాధా కుసుమ, చేతుల మీదుగాహైదరాబాద్ రవీంద్రభారతిలో దేవులపల్లి రమేశ్,ఘనంగా సన్మానించారు. కవి రమేశ్ మాట్లాడుతూ.తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు భాష గొప్ప తనం మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.నాళేశ్వర శంకరం, శిఖామణి, కవులు,రచయితలు తదితరులు పాల్గొన్నారు.



# ఏరియా 51లో ఏలియన్స్ లేరు

మొదటిపేజీ తరువాయి



రహస్య సైనిక స్థావరం చుట్టూ ఎన్నో కథలు, ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. అక్కడే ఏలియన్స్‌ను నిర్బంధించారని, గుర్తుతెలియని ఎగిరే వస్తువులను (యూఎఫ్‌వోలు) అక్కడ పరిశీలిస్తారని సామాజిక మాధ్యమాల్లో తరచూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఇతర గ్రహాల్లో జీవం ఉండే అవకాశాన్ని తాను నమ్ముతున్నానని చెప్పారు. కానీ, ఏరియా 51లో ఏలియన్స్‌ను అమెరికా ప్రభుత్వం దాచిపెట్టిందన్న ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు.

**"ఏలియన్స్ నిర్బంధం అనేది ఆధారరహితం"**

ఒబామా మాట్లాడుతూ, ఏరియా 51లో గ్రహాంతరవాసులు ఉన్నారనే కథలకు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా అలాంటి రహస్య సమాచారమేమీ తనకు అందలేదని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వ దగ్గర ఏలియన్స్ ఉనికి గురించి దాచిపెట్టిన రికార్డులు ఉన్నాయన్న వాదనలకు కూడా ఆయన సమాధానం ఇచ్చారు. అలాంటి విశ్వసనీయ ఆధారాలు లేవని స్పష్టం చేశారు.అయితే విశ్వం ఎంతో విశాలమైందని, అనేక గ్రహాలు ఉన్నాయని, వాటిలో ఎక్కడో జీవం ఉండే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని చెప్పారు. శాస్త్రవేత్తలు కూడా ఈ అంశంపై పరిశోధనలు కొనసాగిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

**రీపర్ డ్రోన్ల రాడార్ రికార్డులపై స్పందన**

కొన్ని సంవత్సరాల క్రితం యూఎస్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన రీపర్ డ్రోన్లు సేకరించిన రాడార్ రికార్డుల్లో అసాధారణ కదలికలు కనిపించాయన్న వార్తలు వెలువడ్డాయి. మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాలపై గుర్తుతెలియని వస్తువులు సంచరించినట్టు నివేదికలు సూచించాయి.ఈ అంశంపై స్పందించిన ఒబామా, అటువంటి ఘటనలపై శాస్త్రీయంగా పరిశీలన జరగాల్సిందే కానీ వాటిని నేరుగా గ్రహాంతరవాసులతో అనుసంధానించడం సరైంది కాదన్నారు. సాంకేతిక లోపాలు, వాతావరణ ప్రభావాలు లేదా ఇతర మానవ నిర్మిత కారణాల వల్ల కూడా రాడార్‌లో అసాధారణ సంకేతాలు కనిపించవచ్చని నిపుణులు చెబుతున్నారని తెలిపారు.

**ఏరియా 51 అంటే ఏమిటి?**

ఏరియా 51 అమెరికాలోని నెవాడ రాష్ట్ర ఎడారిలో ఉన్న అత్యంత రహస్య సైనిక స్థావరం. 1955లో ఈ స్థావరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ప్రదేశం సాధారణ ప్రజలకు పూర్తిగా నిషేధిత ప్రాంతం.ఇక్కడ అమెరికా సైన్యం ఆధునిక ఆయుధాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాలు, యుద్ధ విమానాల పరీక్షలు నిర్వహిస్తుంది. శిక్షణ కార్యక్రమాలు కూడా ఇక్కడే జరుగుతాయి. ఒకప్పుడు ఉపగ్రహాల ద్వారా ఈ ప్రాంత చిత్రాలు తీసే అవకాశాన్ని కూడా పరిమితం చేశారు. తర్వాత కాలంలో ఆ పరిమితులను కొంతవరకు సడలించారు.

**రహస్య విమానాల పరీక్షలు**

ఏరియా 51లో గతంలో ప్రముఖ రహస్య విమానాల పరీక్షలు జరిగాయి. ముఖ్యంగా లాక్‌హీడ్ మార్టిన్ తయారు చేసిన యూ2 నిఘా విమానాన్ని ఇక్కడే పరీక్షించారు. ఆ తర్వాత కూడా పలు ఆధునిక ఫైటర్ జెట్లు, గూఢచారి విమానాల పనితీరును ఇక్కడ అంచనా వేశారు.ఈ రహస్యత కారణంగానే ఏరియా 51 చుట్టూ ఎన్నో కథలు పుట్టుకొచ్చాయి. అక్కడి గగనతలంలో కనిపించే అసాధారణ కదలికలను యూఎఫ్‌వోలుగా భావించడం, వాటిని ఏలియన్స్‌తో అనుసంధానించడం మొదలైంది. కాలక్రమేణా ఇవి కుట్ర సిద్ధాంతాలుగా మారాయి.

**ప్రజల్లో ఆసక్తి ఎందుకు?**

ఏరియా 51పై అధికారిక సమాచారం చాలా పరిమితంగా ఉండటం వల్ల ప్రజల్లో ఆసక్తి పెరిగింది. సోషల్ మీడియా, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. కొందరు అక్కడ ఏలియన్స్ శరీరాలను దాచిపెట్టారని, మరికొందరు అక్కడే గ్రహాంతర టెక్నాలజీపై ప్రయోగాలు చేస్తున్నారని ప్రచారం చేశారు. అయితే అమెరికా ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇవి కేవలం ఊహాగానాలేనని చెబుతూ వచ్చింది. ఒబామా తాజా వ్యాఖ్యలతో కూడా అదే సందేశం మరోసారి వెలుగులోకి వచ్చింది.

**శాస్త్రవేత్తల అభిప్రాయం**

అంతరిక్షంలో జీవం ఉండే అవకాశంపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇతర గ్రహాల్లో నీటి ఆనవాళ్లు, జీవానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయా అనే దానిపై శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. అయితే ఇప్పటివరకు భూమికి బయట జీవం ఉన్నట్టు నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు లభించలేదు.ఒబామా వ్యాఖ్యలు కూడా ఇదే దిశగా ఉన్నాయి. విశ్వం విస్తారమైందని, జీవం ఉండే అవకాశాన్ని పూర్తిగా ఖండించలేమని ఆయన చెప్పారు. కానీ ఏరియా 51లో ఏలియన్స్‌ను దాచిపెట్టారన్న ప్రచారం మాత్రం ఆధారరహితమని తేల్చిచెప్పారు.

గ్రహాంతరవాసుల ఉనికి అంశం ఇప్పటికీ రహస్యంగానే ఉంది. అయితే ఏరియా 51పై ప్రచారంలో ఉన్న కథలకు ఆధారాలు లేవని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా స్పష్టం చేశారు. ఇతర గ్రహాల్లో జీవం ఉండే అవకాశాన్ని ఆయన నమ్ముతున్నప్పటికీ, అమెరికా ప్రభుత్వం ఏలియన్స్‌ను నిర్బంధించిందన్న వాదనలను ఖండించారు. ఈ వ్యాఖ్యలతో ఏరియా 51పై ఉన్న కుట్ర సిద్ధాంతాలు మరోసారి చర్చకు వచ్చాయి. శాస్త్రీయ ఆధారాలు లభించే వరకు ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం దొరకకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# కరీంనగర్ మేయర్ పదవి దక్కించుకుంటాం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కచ్చితంగా రాజకీయ వ్యూహాలు అవలంబిస్తాం
- మెజార్టీ లేకపోయినా బీజేపీ మేయర్ పీఠం ఎలా దక్కించుకుంటుంది?
- ప్రశ్నించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, (ప్రజాస్వరం): కరీంనగర్ మేయర్ పదవిపై రాజకీయ పోటీ రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్న వేళ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంటుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. వేములవాడలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ సంస్థల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీలు అవలంబిస్తున్న వ్యూహాలు, స్థానిక సమీకరణాలపై ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

**కరీంనగర్‌లో మేయర్ పీఠంపై పోటీ**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజార్టీ లేకపోవడం వల్ల మేయర్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు సమీకరణాలపై దృష్టి పెట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లో భాజపా మేయర్ పీఠాన్ని దక్కించుకుంటుందని చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిస్పందించారు.

మెజార్టీ లేని పరిస్థితిలో భాజపా మేయర్ పదవిని ఎలా సాధిస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కార్పొరేషన్లలో ప్రజాస్వామ్య పద్ధతిలోనే మేయర్‌ను ఎన్నుకుంటారని, సంఖ్యాబలం కీలకమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రకటనలతో పదవులు దక్కవని, స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతే నిర్ణాయకమని ఆయన పేర్కొన్నారు.

**నిజామాబాద్ ఉదాహరణను ప్రస్తావించిన మంత్రి**

ఈ సందర్భంగా నిజామాబాద్ కార్పొరేషన్ పరిస్థితిని మంత్రి ప్రస్తావించారు. నిజామాబాద్‌లో మేయర్ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. పూర్తి మెజార్టీ లేకపోవడం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారని అర్వింద్ స్వయంగా చెప్పారని పేర్కొన్నారు.

అదే పరిస్థితి కరీంనగర్‌లో ఉన్నప్పటికీ అక్కడ మాత్రం భాజపా మేయర్ పీఠాన్ని సాధిస్తామని చెప్పడం రాజకీయ విరుద్ధత కాదా అని ప్రశ్నించారు. ఒక చోట మెజార్టీ లేదని వెనక్కి తగ్గి, మరోచోట అదే పరిస్థితిలో గెలుస్తామని చెప్పడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

**'అందరినీ కలుపుకొని'**

కాంగ్రెస్ పార్టీ తరఫున అభివృద్ధి రాజకీయాలను ముందుకు తీసుకెళ్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేయర్ ఎన్నికను కేవలం అధికార పోరాటంగా కాకుండా నగర అభివృద్ధి దృష్టితో చూస్తున్నామని చెప్పారు. కార్పొరేషన్‌లో ఉన్న వివిధ పార్టీల కార్పొరేటర్లతో చర్చలు జరిపి, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున స్థానిక సంస్థల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. నగర అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరియు కార్పొరేషన్ సమన్వయం అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో మేయర్ పదవిని కాంగ్రెస్ దక్కించుకోవడం నగరానికి ప్రయోజనకరమని ఆయన అభిప్రాయపడ్డారు.

**'బీజేపీ ఎలా చేస్తే మేం కూడా అలాగే'**

రాజకీయ వ్యూహాల విషయానికి వస్తే కాంగ్రెస్ కూడా వెనుకాడదని మంత్రి స్పష్టం చేశారు. బీజేపీ ఎలాంటి రాజకీయ ప్రయత్నాలు చేస్తుందో, కాంగ్రెస్ కూడా అదే స్థాయిలో ప్రయత్నాలు చేస్తుందని చెప్పారు. మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నికల సమయంలో రాజకీయ చర్చలు, మద్దతు సమీకరణాలు సహజమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన "క్యాంపు రాజకీయాలు ఉంటాయి" అనే వ్యాఖ్య ప్రత్యేకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తరచుగా కనిపించే విధంగా కార్పొరేటర్లను ఒకచోట ఉంచి మద్దతును కాపాడుకునే రాజకీయ వ్యూహాలు ఈసారి కూడా కనిపించే అవకాశముందని ఆయన సంకేతం ఇచ్చారు.

**కార్పొరేషన్లలో రాజకీయ సమీకరణాల ప్రాధాన్యం**

మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ ఎన్నికలు ప్రత్యక్ష ప్రజాభిప్రాయంతో కాకుండా ఎన్నికైన కార్పొరేటర్ల ఓట్ల ద్వారా జరుగుతాయి. అందువల్ల స్పష్టమైన మెజార్టీ లేని చోట రాజకీయ సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తాయి. స్వతంత్రులు, చిన్న పార్టీల కార్పొరేటర్లు, అసంతృప్త వర్గాలు నిర్ణాయకంగా మారే పరిస్థితి ఉంటుంది.

కరీంనగర్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నందున ప్రతి పార్టీ తనకు అనుకూలంగా సంఖ్యాబలం పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. అధికార పార్టీగా కాంగ్రెస్‌కు పరిపాలనా పరమైన అనుకూలతలు ఉండగా, భాజపా కూడా స్థానిక స్థాయిలో తన బలాన్ని వినియోగించుకునే ప్రయత్నాలు చేస్తోంది.

**రాష్ట్ర రాజకీయాల ప్రతిబింబంగా స్థానిక ఎన్నికలు**

రాష్ట్రంలో అధికార మార్పు జరిగిన తర్వాత స్థానిక సంస్థల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. గతంలో బలంగా ఉన్న పార్టీల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు కొత్త రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ మార్పులు మేయర్ ఎన్నికలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. కరీంనగర్ రాజకీయంగా ఎప్పటినుంచో ప్రాధాన్యమైన నగరం కావడంతో ఇక్కడి మేయర్ ఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో ప్రతిష్ఠాత్మకంగా మారింది. ప్రధాన పార్టీల నాయకులు వరుసగా ప్రకటనలు చేయడం కూడా అదే కారణంగా భావిస్తున్నారు.

**అభివృద్ధి వర్సెస్ రాజకీయ పోటీ**

మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యల్లో అభివృద్ధి అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసే మేయర్ ఉంటే నగరానికి నిధులు, ప్రాజెక్టులు వేగంగా అందే అవకాశం ఉంటుందని ఆయన సూచించారు. నగర అభివృద్ధి రాజకీయ విభేదాలకు అతీతంగా ఉండాలని అన్నారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం అధికార పార్టీ స్థానిక సంస్థలను రాజకీయంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించే అవకాశం ఉంది. దీంతో మేయర్ ఎన్నిక వరకు రాజకీయ వేడి కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

**ముందున్న పరిస్థితి**

ప్రస్తుతం సంఖ్యాబలం స్పష్టంగా లేకపోవడంతో కరీంనగర్ మేయర్ ఎన్నిక చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది. కార్పొరేటర్ల మద్దతు కోసం పార్టీల మధ్య చర్చలు, వ్యూహాలు మరింత వేగం పుంజుకునే అవకాశముంది.క్యాంపు రాజకీయాలు, మద్దతు మార్పులు వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశాన్ని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

మొత్తంగా చూస్తే, మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు కరీంనగర్ మేయర్ పీఠంపై కాంగ్రెస్ పార్టీ దూకుడు వ్యూహాన్ని స్పష్టంగా వెల్లడించాయి. మెజార్టీ లేకపోయినా రాజకీయ సమీకరణాల ద్వారా మేయర్ పదవిని సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ముందుకు సాగుతుండగా, భాజపా కూడా అదే స్థాయిలో పోటీకి సిద్ధమవుతోంది. దీంతో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో కీలక ఘట్టంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

మొత్తం 66 డివిజన్లలో 30 సాధించి బీజేపీ పెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్ కు 9, ఎంఐఎంకు మూడు దక్కగా 10 మంది స్వతంత్రులున్నారు. ఇక్కడ మేయర్ పీఠాన్ని సాధించాలంటే 35 మంది సభ్యుల బలం కావాలి. ఫలితాలొచ్చిన రోజే ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఒకరు, మరో స్వతంత్ర అభ్యర్థి భాజపాలో చేరారు. శనివారం రాత్రి మాసం గణేశ్, వేముల కవిత అనే ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా భాజపా కండువా కప్పుకొన్నారు. వీరితో కలిపి భాజపా బలం 34కు చేరగా.. ఎక్స్ అఫీషియోగా సంజయ్ ఓటుతో మేజిక్ ఫిగర్ 35కి చేరుకోవచ్చు. కానీ ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి చక్రం తిప్పడంతో మేయర్ పదవికి తాజాగా స్వతంత్ర అభ్యర్థి కొమురయ్య పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్, ఎంఐఎంకు కలిపి 17 మంది సభ్యులుండగా, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఒకరు, మరో ఐదుగురు స్వతంత్రులు వీరి శిబిరంలోనే తలదాచుకున్నట్లు తెలుస్తోంది.

# ఆ ఒక్క పుర పీఠాన్నీ రేవంత్ లాక్కొంటున్నడు

మొదటిపేజీ తరువాయి




కూడా ఇంకా అగడు ఎందుకని సీఎంను ప్రశ్నించారు. ఈ వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని విమర్శించారు. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లోకి చేర్చుకొని వెగటు పుట్టేలా చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ కు కూడా ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం, అడిగే వాళ్లు ఉండకూడదనే ధోరణితో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవాలాల్ 287 వ జయంతి వేడుకలను ఆదివారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేసిన కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నేతలనే సీఎం ముందు కలుస్తున్నారని విమర్శించిన కవిత.. అధికార పార్టీ నేతలను పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు. తన వ్యాఖ్యలపై ఒక్కసారి ఆలోచన చేయాలని అధికార పార్టీ నేతలను కోరారు. మీకు నిధులు రాకపోతే ఓటర్లకు మీరిచ్చిన హామీల సంగతేంటో ఒక్కసారి ఆలోచన చేయాలని కవిత చెప్పారు. సేవాలాల్ పేరుతో, ఆదివాసీల పేరుతో, ఎరుకల తెగ పేరుతో ఏర్పాటు చేస్తామన్న మూడు కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, మహబూబాబాద్ లో ఐటీడీఏ లు పెట్టాల్సిందేనన్నారు. ఐటీడీఏ లలోనే ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తామన్న కాంగ్రెస్ నేతలు అధికారంలో వచ్చాకా వాటిని పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

సేవాలాల్ జయంతిని జరుపుకోవటం సంతోషంగా ఉందన్న కవిత.. దేశ వ్యాప్తంగా బంజారా జాతి మేలు కోసం కృషి చేసిన సేవాలాల్ జీవిత చరిత్రను దేశ వ్యాప్తంగా పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలన్నారు. గోర్ భోళి భాషను కచ్చితంగా 8 వ షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. బంజరాల్లో ఉన్న పేదరికాన్ని నిర్మూలించాలంటే ప్రత్యేక కార్యాచరణతో ప్రత్యేక నిధిని కేటాయించాలని కవిత డిమాండ్ చేశారు. అన్ని పార్టీలు బంజారా శాఖను విభాగంగా పెట్టుకుంటాయన్న కవిత.. జాగృతి మాత్రం తన మెయిన్ బాడీలోనే వర్కింగ్ ప్రెసిడెంట్ గా బంజారా బిడ్డకు అవకాశం ఇచ్చిందన్నారు. వెనుకబడిన జాతిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. జాగృతిలో బంజారా, ఆదివాసీ రెండు శాఖలను పెట్టుకున్నామన్న కవిత... రెండు వర్గాల అభ్యున్నతి, హక్కుల కోసం పోరాటం చేస్తామని చెప్పారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రెండేళ్లలో అడ్మిషన్లు, ప్రమోషన్లు, ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్లు అమలు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంజారాలు, ఆదివాసీల మధ్య పంచాయితీ పెట్టే కుట్ర మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. బంజారా యువమిత్రులు తండాల్లో వెలుగులు నింపేలా నాయకత్వం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కవిత అభిప్రాయపడ్డారు. అందుకు రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో తండాలను గ్రామపంచాయితీలుగా చేసుకున్నప్పటికీ సరైన వసతులు మాత్రం లేవని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రతి తండాకు రూ. 25 లక్షలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. తండాల్లో రేషన్ షాప్ లు, గ్రామపంచాయితీ, అంగన్ వాడీలు నిర్మించాలన్నారు.

# తండాలు, గూడేలకు మహార్ధశ తెస్తాం

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. తాగడానికి మంచినీరు, కరెంట్ అందించాలన్న సీఎం.. అటవీ ప్రాంతాల్లో ఉండే సమస్యలను దృష్టిలో ఉంచుకుని కరెంట్ లేని చోట సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తూ గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆదివారం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నల్లమల అటవీ ప్రాంతంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామనిప్రకటించారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను అక్కడే నిర్వహించుకునేలా, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యద్భుతంగా పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని అన్నారు. ఆదివాసీలకు ఆదిలాబాద్‌లో నాగోబా దేవాలయం, మేడారంలో సమ్మక్క సారలమ్మ పుణ్యక్షేత్రం ఉన్నట్టుగా బంజారాలకు ప్రత్యేక క్షేత్రం లేదని పేర్కొన్నారు. అందుకోసం నల్లమల అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించినందున, అక్కడ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రపంచంలోనే బ్రహ్మాండమైన పుణ్యక్షేత్రంగా, గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మానవజాతి శాంతి మార్గంలో, చెడును విడిచి, భక్తితో సన్మార్గంలో నడవాలని బోధించిన సంత్ సేవాలాల్ దేశంలో 15 కోట్ల మంది గిరిజనులకు ఆదర్శప్రాయంగా నిలిచారని సీఎం కొనియాడార. అలాంటి మహనీయుని జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడా సోదరుల పాత్ర ఎవరూ మరువలేనిదని వెల్లడించారు. వారికి సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వంలో సముచిత స్థానం, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. 2006 నుంచి ఇప్పటివరకు ప్రతి సందర్భంలోనూ లంబాడా సోదరులు తనకు అండగా నిలిచారని చెప్పారు. ప్రWజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందన్న సీఎం... నిరుపేదలకు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవని చెప్పారు. నిరక్షరాస్యత కారణంగా చాలా మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నిరుపేదలు చదువుకోవడానికి కావలసిన అన్ని వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో కష్టపడి చదువుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం ఉద్బోధించారు. ఈ సందర్భంగా సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన సీఎం... అంతకుముందు బంజారాలు ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ పోరిక బలరాం నాయక్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# రేవంత్ ఒక్కడే మొనగాడా..?

మొదటిపేజీ తరువాయి



సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడే మొనగాడా..? అని నిలదీశారు. పదేళ్లు నేనే ముఖ్యమంత్రి ఉంటా అని చెప్పుకోవడం తప్పు కాదా ? అని ప్రశ్నించారు. ఆదివారం నల్గొండలో ఓ మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. సీఎంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మీడియాతో చిట్ చాట్ చేసిన రేవంత్ రెడ్డి... పదేళ్లు నేనే ముఖ్యమంత్రి ఉంటా అని చెప్పుకోవడం తప్పు కాదా ? అని ప్రశ్నించారు. సీఎం ఆ వ్యాఖ్యలు చేసి ఏండ్ల నుంచి కాంగ్రెస్ లో ఉన్న సీనియర్ నాయకులతో పాటు అధిష్టానాన్నీ అవమానించారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి నిజంగా మొనగాడు అయితే... పార్టీలో ఆయన గట్టోడయితే మహబూబ్ నగర్ ఎంపీ సీటు ఎందుకు చేజారిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బలమైన వ్యక్తి అయితే మల్కాజ్ గిరి ఎంపీ సిట్టింగ్ సీటులో ఎందుకు ఓడిపోయామో వివరణ ఇవ్వాలన్నారు. ఆయన అంత బలవంతుడే అయితే ఆదిలాబాద్,కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎందుకు గెలవలేక పోయిందో జవాబు చెప్పాలన్నారు. రేవంత్ పీసీసీగా ఉన్న సమయంలో హుజురాబాద్,మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ లు ఎందుకు రాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన చెప్పుకుంటున్నట్లు రేవంత్ బలమైన నాయకుడు కాదన్న రాజగోపాల్ రెడ్డి... పార్టీ అధికారంలోకి వచ్చింది అంటే అది కాంగ్రెస్ పార్టీ చెమట చుక్క ఫలితమే అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17164, CELL : 8008609999